
ప్రజాశక్తి
శనివారం 18 మార్చి 2023 5 విజయనగరం



'సీతం'లో మెషీన్ లెర్నింగ్‌పై శిక్షణ

ప్రజాశక్తి-విజయనగరం

సీతం కళాశాలలో కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మెషిన్ లెర్నింగ్ పై రెండు రోజుల శిక్షణ శుక్రవారం ప్రారంభమైనది. మొదటి రోజు ' ఎండ్ టు ఎండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ మెషీన్ లెర్నింగ్ ఇన్ బ్యాంకింగ్' అనే అంశం పై కార్యశాల నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన విపిఎ ఐఎనిసి డైరెక్టర్ ఆరవిల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. బ్యాంకింగ్‌లో మెషిన్ లెర్నింగ్ అమలు గురించి వివరించారు. మెషీన్ లెర్నింగ్ లో ప్రాథమిక అంశాలను, బ్యాంకింగ్‌లో మెషీన్ లెర్నింగ్ అనువర్తనాలను, అధునాతన కృత్రిమ మేధ, మెషీన్ లెర్నింగ్ ల అనువర్తనాల గురించి వివరించారు. కార్యక్రమంలో సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణ రావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామమూర్తి, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ వేణు మాధవ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండలి విజేత టిడిపి

8 రౌండ్లలోనూ చిరంజీవిరావుదే ఆధిక్యం ● సిట్టింగ్ బిజెపి ఎమ్మెల్సీ మాధవ్ సహా 34 మందికి డిపాజిట్లు గల్లంతు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాన్ని టిడిపి దక్కించుకుంది. ఆ పార్టీ తరపున బరిలోకి దిగిన వేపాడ చిరంజీవిరావు విజేతగా నిలిచారు. ఈ నెల 16న ఉదయం 8 గంటల నుంచి ఎడతెరిపి లేకుండా 17వ తేదీ రాత్రి వరకూ మండలి ఓట్ల లెక్కింపును సుమారు 500 మంది సిబ్బంది చేపట్టారు. టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు, వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ మధ్యనే ప్రధాన పోటీ నెలకొంది. పోలైన మొదటి ప్రాధాన్య ఓట్లలో టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావుకు 82,977, సీతంరాజు సుధాకర్‌కు 55,749 ఓట్లు వచ్చాయి. పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ 35,148 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. చిరంజీవిరావు విజయానికి ఇంకా 11,551 ఓట్లు అవసరం కావడంతో అధికారులు ఎలిమినేషన్ ప్రక్రియకు వెళ్లారు. 37 మంది అభ్యర్థుల్లో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని ఎలిమినేషన్ చేస్తూ, వారికి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యతా ఓట్లను కలిపే దిశగా ఎన్నికల సిబ్బంది కసరత్తు ఆరంభించారు. అయితే ఓ న్యాయవాది వేసిన కేసు నేపథ్యంలో ఈ ఎమ్మెల్సీ ఎన్నిక ఫలితం తమకు లోబడి ఉండాలన్న హైకోర్టు తీర్పు నేపథ్యంలో విజేతను ఎన్నికల అధికారి ప్రకటిస్తారా ? లేదా ? అన్నదానిపై రకరకాల చర్చలు నడుస్తున్నాయి.

బిజెపికి డిపాజిట్ గల్లంతు

బిజెపి అభ్యర్థి పివిఎన్ మాధవ్‌కు 10,884 ఓట్లు రాగా డిపాజిట్ గల్లంతైంది. 2017లో టిడిపి మద్దతుతో మాధవ్ బిజెపి తరపున ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలుపొందారు. అంతకు ముందు 2007, 2011 సంవత్సరాల్లో వరుసగా పిడిఎఫ్ అభ్యర్థి ఎంవిఎస్ శర్మ ఈ స్థానంలో గెలిచారు. 2023లో టిడిపి నేరుగా వేపాడ చిరంజీవిరావును బరిలోకి దింపి ఆ సీటు దక్కించుకోవడం విశేషం.

గెలుపునకు కారణాలివే..

విశాఖలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన కౌంటింగ్ తొలి రౌండ్ నుంచీ టిడిపి అభ్యర్థి ఆధిక్యతను ప్రదర్శిస్తూ వచ్చారు. టిడిపికి జనసేనకు చెందిన పట్టభద్రులంతా ఈ ఎన్నికల్లో మద్దతుగా నిలిచి ఓట్లేశారు. అధికార పార్టీ వైసిపిపై ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో వ్యతిరేకత కూడా టిడిపికి కలిసొచ్చింది. 20 ఏళ్లకు పైగా వేపాడ చిరంజీవిరావు ఆర్‌సి రెడ్డి కోచింగ్ సెంటర్, ఇతర కళాశాలల్లో ఎకానమీ లెక్చరర్‌గా కోచింగ్ ఇస్తూ పలువురు శిష్య బృందాన్ని తయారు చేసుకోవడంతో వారంతా ఈ ఎన్నికల్లో ఓటర్లను కలిసి ఆయన విజయానికి చేదోడుగా నిలిచినట్లు తెలుస్తోంది.

వైసిపికి దెబ్బ

ఐదుగురు మంత్రులు, ఇద్దరు డిప్యూటీ సిఎంలు, ఆరుగురు ఎంపీలు, ఉత్తరాంధ్ర ఉమ్మడి జిల్లాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు, జిల్లాల సమన్వయ కమిటీల నేతలు కలిసినా కూడా వైసిపిని ఈ ఎన్నికల్లో గెలిపించుకోలేక పోయారన్న విమర్శలు అధికార వైసిపి ఎదుర్కొంటోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ విషయంలో ఓట్లను సాధించడంలో పైచేయి సాధించలేకపోయారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు అధికార వైసిపికి దెబ్బ కొట్టారన్నది స్పష్టంగా తేలిపోయింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటును అత్యధికంగా టిడిపి లాక్కోగలిగింది. ఎన్నికల బరిలోకి ఆలస్యంగా ఎంట్రీ ఇచ్చిన చిరంజీవి.. ఓట్ల నమోదులో కూడా గణనీయ పాత్రే పోషించలేదు. అయినప్పటికీ ఎమ్మెల్సీ స్థానంలో విజేతగా నిలవడం చూస్తే వైసిపి వ్యతిరేకత పట్టభద్రుల్లో ఎంత ఉందో వెల్లడవుతోంది. అనూహ్యమైన రీతిలో తెలుగుదేశం పార్టీ బరిలోకి దిగి ఈ స్థానాన్ని కైవసం చేసుకోగలిగింది. గతంలో గాడు చిన్న కుమారి లక్ష్మిని ఎమ్మెల్సీ అభ్యర్థిగా టిడిపి అధినేత చంద్రబాబునాయుడు బరిలోకి దింపారు. ఆమెను మార్చాలని ఆయనపై టిడిపి శ్రేణులు ఒత్తిడి తేవడంతో చిరంజీవిరావును బరిలోకి దింపి వ్యూహాత్మకంగా వ్యవహరించి విజయం సాధించారు.

ప్రధాన అభ్యర్థులు ఎవరేమన్నారంటే?

తానే గెలవనున్నానని ధీమా తొలి నుంచీ ఉందని చిరంజీవిరావు తెలిపారు. ప్రభుత్వంపై వ్యతిరేకత తనను దెబ్బతీసిందంటూ వైసిపి అభ్యర్థి సీతంరాజు సుధాకర్ వెల్లడించారు.



కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వస్తున్న వేపాడ చిరంజీవిరావు

ఓటర్లకు ధన్యవాదాలు

పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ

విశాఖ కలెక్టరేట్ : మండలి ఎన్నికలలో తనకు ఓటు వేసిన వారందరికీ పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ ఓ ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. పట్టభద్రుల ఎన్నికలను సాధారణ ఎన్నికల రాజకీయ పార్టీలు మార్చేసినా.. ఎలాంటి ప్రలోభాలకూ లోనవకుండా 35 వేల మందికి పైగా పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటును తనకు వేశారన్నారు. నిస్వార్థంగా ప్రచారంలో పాల్గొని, అహర్నిశలూ కృషి చేసిన ప్రజా సంఘాల కార్యకర్తలకు, నాయకులకు, శ్రేయోభిలాషులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



గజపతినగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి శ్రేణులు

రీసర్వేతో భూసమస్యలకు పరిష్కారం

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- చీపురుపల్లి, మెరకముడిదాం మండలాల్లో పర్యటన
- రావివలస సచివాలయంలో తనిఖీలు



రీసర్వేపై ఆరా తీస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

ప్రజాశక్తి-చీపురుపల్లి, మెరకముడిదాం

జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం కింద చేపట్టిన భూసర్వే ద్వారా వివిధ రకాల భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. చీపురుపల్లి మండలం రావివలస, మెరకముడిదాం మండలం బైరిపురం గ్రామాల్లో ఆమె శుక్రవారం పర్యటించారు. రీ సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఆయా మండలాల్లో ఇప్పటివరకు నిర్వహించిన భూముల రీసర్వే వివరాలను తహశీల్దార్లు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటివరకు జరిగిన డ్రోన్ సర్వే, రికార్డుల్లో నమోదు తదితర అంశాలపై కలెక్టర్ ప్రశ్నించారు. రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే చేయడమే కాకుండా, ఎప్పటికప్పుడు రికార్డుల్లో వివరాలను నమోదు చేయాలని సూచించారు. రికార్డులు అత్యంత కచ్చితంగా ఉండాలని కలెక్టర్ స్పష్టంచేశారు. ఈ పర్యటనలో చీపురుపల్లి, మెరకముడిదాం తహశీల్దార్లు ఎం.సురేష్, బి.రత్నాకర్, ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలను త్వరగా పూర్తిచేయాలి

గ్రామంలో చేపట్టిన ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. చీపురుపల్లి మండలం రావివలస గ్రామ సచివాలయాన్ని ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సిబ్బంది హాజరును, రికార్డులను తనిఖీ చేశారు. సఖి కార్యక్రమం, వివిధ ప్రభుత్వ పథకాల అమలు, గర్భిణులకు, పిల్లలకు రక్త పరీక్షలు, పోషకాహార పంపిణీ గురించి తెలుసుకున్నారు. సఖి గ్రూపు సభ్యులను మరింత చైతన్యం చేయాలని సూచించారు. గృహనిర్మాణ కార్యక్రమంపై ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసి, ఉగాది నాటికి గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని చెప్పారు.

పరిసరాల పరిశభ్రతకు ప్రాధాన్యత

డిఎంహెచ్‌ఒ రమణకుమారి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.వి.రమణ కుమారి.. సిబ్బందికి సూచించారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా శుక్రవారం మండలంలోని సీతారామునిపేటలో ఆమె పర్యటించారు. వెల్‌నెస్ సెంటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చి రోగాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా మురుగునీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టి, జ్వరాలున్న వారిని గుర్తించి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం నూతనంగా నిర్మించిన విలేజ్ క్లినిక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో సతివాడ పిహెచ్‌సి హెల్త్ సూపర్‌వైజర్ నారాయణ, సిహెచ్‌ఒ హిమబిందు, ఎఎన్ఎం కోమలి, పంచాయతీ కార్యదర్శి ధరణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డిఎంహెచ్‌ఒ రమణకుమారి

ఐదుగురు విద్యార్థులు డిబార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం ఇంగ్లీషు పరీక్షకు 25,274 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ జనరల్ పరీక్షకు 20,908 మంది హాజరు కావాల్సి ఉండగా, 19,872 మంది హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 6146 మంది హాజరు కావాల్సి ఉండగా, 5402 మంది మాత్రమే హాజరయ్యారు. మొత్తం రెండు పరీక్షలకు కలిసి 1780 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఆర్ఐ నాలుగు పరీక్షా కేంద్రాలను, డిఇసి మూడు కేంద్రాలను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు కూడా విస్తతంగా తనిఖీలు నిర్వహించాయి. పలు కేంద్రాల్లో మాల్ ప్రాక్టీసుకు పాల్పడుతున్న ఐదుగురు విద్యార్థులపై కేసులు నమోదు చేశారు. పి.కోనవలసలో ఇద్దరు, మెరక ముడిదాంలో ఇద్దరు, ఎస్.కోటలో ఒక విద్యార్థి మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడటంతో వారిని డిబార్ చేసినట్లు ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ తెలిపారు.

పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

గుర్ల : ఇంటర్‌మీడియట్ పరీక్షా కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి తనిఖీ చేశారు. శుక్రవారం గుర్ల మండలంలో ఆమె పర్యటించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. పరీక్ష నిర్వహణకు చేసిన ఏర్పాట్లను ప్రిన్సిపల్ ద్వారా తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం తాగునీరు ఏర్పాటు చేయాలని సూచించారు. మాల్ ప్రాక్టీసు జరగకుండా చూడాలని, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.



గుర్ల.. పరీక్షా కేంద్రంలో తనిఖీలు చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

నిలిచిన యుహెచ్‌సి భవన నిర్మాణాలు




కెఎల్‌పురంలో మధ్యలో ఆగిపోయిన యుహెచ్‌సి భవన నిర్మాణం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

విజయనగరంలో నిర్మితమవుతున్న అర్బన్ హెల్త్ కేంద్రాల పనులు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయి. నగరంలో 2021 మార్చిలో రాష్ట్ర ప్రభుత్వం 7 అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను మంజూరు చేసింది. అర్బన్ కేంద్రాల్లో వీటి నిర్మాణాల కోసం మార్చిలోనే రూ.100 కోట్లు నిధులు రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేసింది. నగరంలో ఒక్కొక్క భవనం నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరు చేసింది. అన్ని వసతులతో 500 గజాలు స్థలంలో హెల్త్ కేంద్రాలను నిర్మించాల్సి ఉంది. కరోనా లాంటి ప్రాణాంతమైన వ్యాధులు వచ్చి వైద్యం అందక ప్రజలు చనిపోతుండటంతో అర్బన్ హెల్త్ కేంద్రాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం వీటిని మంజూరు చేసింది. వెంటనే టెండర్లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభించాలని ప్రభుత్వం అప్పుడే ఆదేశించింది. 2021 మార్చిలోనే వీటి నిర్మాణానికి నగరపాలక సంస్థ అధికారులు టెండర్లు పిలిచినా ఆ ఏడాది చివరి వరకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. ఆ తరువాత కాంట్రాక్టర్లు వచ్చినా పనులు ప్రారంభించి రెండేళ్లయినా సగం పనులు కూడా పూర్తి కాలేదు. గతంలో నగర పాలక సంస్థలోచేపట్టిన అభివృద్ధి పనులకు నేటి వరకు బిల్లులు చెల్లించక పోవడం వల్లే అభివృద్ధి పనులు నిలిచిపోయాయనే చర్చ జరుగుతోంది.

విడుదల కాని నిధులు

ఏడు అర్బన్ హెల్త్ కేంద్రాల్లో వైఎస్‌ఆర్ నగర్, గాజులరేగలో మాత్రమే నిర్మాణాలు పూర్తయ్యాయి. కెఎల్ పురం, విటి అగ్రహారం, దాసన్నపేట, బాబామెట్ట, ధర్మపురి, వంటి ప్రాంతాలలో నిర్మాణాలు మధ్యలో నిలిచిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం మొదటి దశలో 25 శాతం నిధులు ఇచ్చి తర్వాత నిధులు ఇవ్వకపోవడంతో నిర్మాణాలు మధ్యలో ఆగిపోయాయి. ఎప్పటికి వీటిని ప్రభుత్వం పూ ర్తి చేస్తుందో వేచి చూడాల్సిందే.



మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి వెంకట సుబ్బయ్య

మల్టీ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలి

జెఎన్‌టియు విసి వెంకట సుబ్బయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రతి విద్యార్థి మల్టీ స్కిల్స్‌ను అభివృద్ధి చేసుకోవాలని జెఎన్‌టియ వైస్ ఛాన్సలర్ వెంకటసుబయ్య అన్నారు. శుక్రవారం స్థానిక జెఎన్‌టియు యూనివర్సిటీలో జాతీయ స్థాయి టెక్నో సింపోజియం సదస్సును విసి వెంకట సుబ్బయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా మార్పులు తెలుసుకోవాలన్నారు. ఇటువంటి సదస్సులు విద్యార్థుల్లో ఉన్న నైపుణ్యాలను వెలికతీసేందుకు దోహదం చేస్తాయన్నారు. గ్రూప్ చర్చలు ద్వారా భావాలను పంచుకోవడం ఇతరుల నుంచి మరింత జ్ఞానాన్ని పెంపొందించు కోవచ్చునని తెలిపారు. విద్యతో పాటు ఇతర అంశాలపై కూడా అవగాహన అవసరం పెంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, వివిధ విద్యా సంస్థల విద్యార్దులు పాల్గొన్నారు.

ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై వడ్డీ మాఫీ

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను ఈనెల 30లోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. పాత బకాయి, ఈఏడాది పన్ను పూర్తిగా చెల్లిస్తే ప్రభుత్వం వడ్డీ మాఫీ చేస్తుందని చెప్పారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంతకాపల్లి వెంకటేశ్వర ఆలయం.. టిటిడిలో విలీనం

ప్రజాశక్తి-రాజాం

మండలంలోని అంతకాపల్లి గ్రామంలో నిర్మించిన వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం టిటిడి విలీనం చేసుకుంది. ఇప్పటిదాకా ఆలయాన్ని నిర్వహిస్తున్న బాలాజీ ట్రస్టు సభ్యులు శుక్రవారం టిటిడి ఇఒ ఎవి ధర్మారెడ్డికి ఆలయానికి సంబంధించిన పత్రాలు అందజేశారు. ఇకపై ఈ ఆలయంలో టిటిడి పద్ధతి ప్రకారం సేవలన్నీ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఇఒ ఎవి ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడారు. గ్రంధి మల్లికార్జునరావు నిర్మించిన ఆలయాన్ని బాలాజీ ట్రస్టు పర్యవేక్షణలో జిఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ ఆలయాన్ని టిటిడి నిర్వహించాలని గ్రంధి మల్లికార్జునరావు కోరారని తెలిపారు. టిటిడి పాలకమండలి అందుకు ఆమోదించడంతో ఆలయాన్ని విలీనం చేసుకున్నామని వెల్లడించారు. టిటిడి పరిధిలో ఇప్పటి వరకు సుమారు 60 ఆలయాలు ఉన్నాయని వివరించారు. విశాఖపట్నం డిప్యూటీ ఇఒ పరిధిలోకి రాజాం ఆలయం వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రంధి ఈశ్వరరావు, గ్రంధి నీలాచలం, గ్రంధి భాస్కరరావు, కొల్లూరు వెంకట నాగేశ్వరరావు, జీఎంఆర్ కుటుంబసభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ

కమిషనర్ శ్రీరాములునాయుడు



సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో మొక్కల సంరక్షణకు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి కమిషనర్ శ్రీరాములునాయుడు ఆదేశించారు. శుక్రవారం ఉదయం కార్యాలయ ఆవరణలో మొక్కల సంరక్షణ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళి మనుగడకు మొక్కలు ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ ఉద్దేశంతోనే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న పచ్చ తోరణం కింద నగరంలో అనేక మొక్కలను నాటినట్లు చెప్పారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సూచనలు సలహాలతో మొక్కల సంరక్షణ బాధ్యతను సమీప స్థానికులకు అప్పగించినట్లు తెలిపారు. ప్రస్తుత వేసవి కాలంలో మొక్కలు చనిపోయే ప్రమాదం ఉందని, ప్రతి మొక్కను సంరక్షించు కోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. డివైడర్లలో ప్రత్యేకంగా మొక్కలను పెంచుతున్న దృష్ట్యా వాటికి సరిపడా నీటిని అందించాలన్నారు. త్వరలో 2 నీటి ట్యాంకర్లు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అనంతరం పాలాస్పత్రిలో సచివాలయ కార్యదర్శులతో సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్నుతో చెత్త పన్ను అనుసంధానం చేసే ప్రక్రియ మందకొడిగా సాగుతున్న రీత్యా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అనుసంధాన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేయాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో డిఇ అప్పారావు, మొక్కల సంరక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పథకాల పరిశీలన

వేసవిలో తాగునీటికి ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికలు తో జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ శ్రీరాములునాయుడు వెల్లడించారు. శుక్రవారం మొయిద జంక్షన్ కుదిపి వద్ద వాటర్ వర్క్స్, రామతీర్థం వాటర్ వర్క్స్ ను పరిశీలించారు. నీటి సామర్థ్యం ఏ మేరకు ఉంది, లీకులు, ఇతర సాంకేతిక పరమైన సమస్యలను అక్కడున్న సిబ్బందికి, ఇంజనీరింగ్ అధికారులకు అడిగి తెలుసుకున్నారు. ఇసుక బస్తాలు అమర్చుతున్న తీరును గమనించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో వేసవికాలంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. లీకులను సరి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామన్నారు. నీటి మట్టాలు అడుగంటిన పరిస్థితుల్లో ఇతర జలశయాల నుంచి నీటి పంపింగ్ చేసే ఏర్పాట్లు కూడా చేస్తున్నామన్నారు. తాగునీటిని వృథా చేయకుండా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆన్ ఆఫ్ స్విచ్‌లను విధిగా వినియోగించాలని చెప్పారు. కార్యక్రమంలో డిఇ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైసిపి పతనం ప్రారంభం

టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున ● చిరంజీవి గెలుపుపై టిడిపి శ్రేణుల హర్షం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో వైసిపి ప్రభుత్వ పతనం ప్రారంభమైందని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. ఎమ్మెల్సీగా వేపాడ చిరంజీవిరావు గెలుపొందిన నేపథ్యంలో శుక్రవారం అశోక్‌బంగ్లాలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసిపికి వ్యతిరేకంగా చిరంజీవి రావుకు ఓటు వేసి ఉత్తరాంధ్ర పట్టభద్రులు ప్రజాస్వామ్యాన్ని కాపాడారని చెప్పారు. వైసిపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను పట్టభద్రులు ఓటు ద్వారా తిప్పుకొట్టారన్నారు. ఈ విజయం టిడిపితో పాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగులు, యువత సాధించిన విజయం అన్నారు. రానున్న 2024లో జరిగే ఎన్నికలు ఫలితాలు ఎలా ఉండబోతున్నాయో ఎన్నికల విజయం ద్వారా పట్టభద్రులు తెలియచెప్పారన్నారు. అనంతరం అశోక్‌బంగ్లా వద్ద టిడిపి నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి సందడి చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అశోక్‌గజపతిరాజు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు పాల్గొన్నారు. టిడిపి కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ఆధ్వర్యాన సంబరాలు జరుపుకున్నారు. జొన్నవలసలో ఎంపిటిసి సభ్యులు పి.రాజేష్‌వర్మ ఆధ్వర్యాన టిడిపి కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. పెద్దవీధి గుండా ర్యాలీ నిర్వహించారు.

గజపతినగరం : చిరంజీవిరావు గెలుపును హర్షిస్తూ పట్టణంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు అట్టాడ లక్ష్మునాయుడు ఆధ్వర్యాన బాణా సంచా కాల్చి సందడి చేశారు. అనంతరం పార్టీ కార్యాలయం నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.

చిరంజీవి గెలుపుపై టిడిపి సంబరాలు

జామి : చిరంజీవి గెలుపొందిన సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు లగుడు రవికుమార్, పి. స్వామినాయుడు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు బండారు పెద్దబాబు ఆధ్వర్యంలో మండలంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. భాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. జామి బస్టాండ్ లో కేక్ కట్ చేసి, స్వీట్లు పంచిపెట్టారు.

వేపాడ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు విజయం సాధించడంతో శుక్రవారం వేపాడలో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఎన్నికల్లో సహకరించిన అందరికీ టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు గుమ్మడి భారతి, నాయకులు సేనాపతి గణేష్, జనపరెడ్డి ఈశ్వరరావు, మంచిన అప్పలసూరి, సిరికి రమణ, బానాది ఎంపిటిసి గొంప తులసి, తాడి కృష్ణ పాల్గొన్నారు.

గుర్ల : ఉత్తరాంధ్ర ప్రజలు సిఎం జగన్‌ను నమ్మలేదని టిడిపి బిసి సెల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ వెన్నె సన్యాసినాయుడు, నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ నాగులపల్లి నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఇచ్చిన తీర్పు ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

జగన్‌ను పట్టభద్రులు విశ్వసించలేదు

విజయనగరం : వైసిపి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించే విధంగా పట్టభద్రులు తీర్పు ఇచ్చారని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలతో వైసిపి ప్రభుత్వ పతనం ప్రారంభమైందన్నారు. రాజకీయ బెదిరింపులు, ప్రలోభాలకు తలొగ్గకుండా పట్టభద్రులు ప్రజాస్వామ్యాన్ని కాపాడారన్నారు. వైకాపా ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను పట్టభద్రులు ఓటు ద్వారా తిప్పుకొట్టారన్నారు.



విజయనగరంలో సంబరాలు చేసుకుంటున్న టిడిపి కార్యకర్తలు


బాసంగిలో నేలకొరిగిన అరటి తోట

గాలులకు నేలకొరిగిన అరటి

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

తుఫాన్ ప్రభావంతో గురువారం సాయంత్రం గాలులు వీయడంతో మండలంలో పలు గ్రామాల్లో అరటి పంట నేలకొరిగింది. దీంతో అన్నదాతలు తీవ్రంగా నష్ట పోయారు. వేలాది రూపాయలు అరటి పంటకు పెట్టుబడులు పెట్టి పంట చేతికి వస్తున్న సమయంలో గాలుల ప్రభావంతో పంటను నష్టపోయారు. ఆదాయం పెరుగుతుందని ఆశించి అరటి పంటను వేస్తున్నామని, గాలుల తీవ్రతతో పంట నేలకొరగడంతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నామని రైతన్నలు లబోదిబోమంటున్నారు. మండలంలో సుమారు 7 వేల ఎకరాల్లో అరటి పంట సాగవుతోంది. మండలంలోని పెద మేరంగి, కన్నపుదొరవలస, బిత్రపాడు, బాసంగి, గౌరమ్మపేట, చింతల బెలగాం, పరజపాడు, కుదమ, కుందలతిరువాడ పంచాయతీల్లో అరటి పంటను ఎక్కువగా సాగవుతోంది. అరటి తోటలు గాలుల ప్రభావంతో నేలకొరగ డంతో అన్నదాతలు ఆవేదనకు గురిచేసింది.

నంబియార్‌కు ఆనందోబ్రహ్మ ఉగాది పురస్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి


నంబియార్ వేణుగోపాలరావు

ప్రముఖ కళాకారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నంబియార్ వేణుగోపాలరావును ఆనందోబ్రహ్మ ఉగాది పురస్కారానికి ఎంపిక చేసినట్లు యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షులు ఎం.విజయమోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో ఏళ్లుగా కళాభారతి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా వందలాది కళాకారులకు ప్రోత్సహిస్తూ, అనేక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేసినందుకు గాను ఆయనను సెలక్షన్ కమిటీ ఈ అవార్డుకు ఎంపిక చేసిందని తెలిపారు. ఈ నెల 19న కళాభారతి ఆడిటోరియంలో ఆయనకు యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఎంపిక చేసిన తొలి ఉగాది పురస్కారాన్ని అందజేస్తామని వెల్లడించారు.

కెమిశీల పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని కెమిశీల ఆశ్రమ పాఠశాలను ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ శుక్ర వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో విద్యా ప్రమాణాలు, ఆహార పదార్థాల తయారీ తదితర వివరాలను పరిశీలించారు. విద్యార్థుల భవిష్యత్తుపై దృష్టి సారించాలని ఆదేశించారు. చక్కని భవితకు పునాదులు వేయాలని స్పష్టం చేశారు. ప్రతి తరగతిలో ప్రమాణాలు మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఉన్నత విద్యావకాశాలు తెలియజేయాలని, అందుకు అనుగుణంగా బోధన అందించాలని పిఒ అన్నారు. పోటీ ప్రపంచంలో విద్యార్థులు వెనుకంజలో ఉండరాదని స్పష్టం చేశారు. మంచి ఆహారాన్ని అందించాలని, తద్వారా విద్యపై దృష్టి సారించగలరని ఆయన చెప్పారు. ఆహార పదార్థాల తయారీ సమయంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నపాటి నిర్లక్ష్యం తీవ్ర పరిస్థితులకు దారితీస్తుందని గ్రహించాలని పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి నిల్వతో దోమల వ్యాప్తి

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

మురుగునీరు గృహ పరిసరాల్లో నిల్వ ఉంచడం వల్లే దోమలు వ్యాప్తి చెంది, వివిధ రోగాలకు కారణమౌతు న్నాయని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాధరావు అన్నారు. మండలంలోని బందలుప్పి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైద్యసిబ్బంది బాలగొడబ లో శుక్రవారం నిర్వహించిన డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా పరిశీలించిన ఆయన గ్రామంలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి దోమలు వ్యాప్తి నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమలు వల్ల కలిగే వ్యాధుల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ పరిసర ప్రాంతాల్లో గాని ఆరుబయటగానీ ఖాళీ టైర్లు, కొబ్బరిబొండాలు, విరిగిపోయిన పాత్రలు, నీటికుంటల్లో మురుగు నీరు నిల్వ ఉంచడం వల్ల దోమలు ఆవాసాలుగా మార్చుకుని సంతానాన్ని వృద్ధి చేసుకుంటాయని, దీనివల్ల ఇళ్లలోకి ప్రవేశించి ఆనారోగ్యానికి కారణమౌతాయని వివరిస్తూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి పరిసరాలను శుభ్రపర్చుకోవాలని పిలుపినిచ్చారు. కార్యక్రమంలో పిహెచ్ వైద్యాదికారి డాక్టర్ ఎన్ఎంకె తిరుమల ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ శ్రీధర్, సిహెచ్ఒ జగదీష్‌కుమార్, ఆశా తదితరులు పాల్గొన్నారు.

రహదారి విస్తరణ పనులకు మార్కింగ్

ప్రజాశక్తి-కురుపాం

కురుపాం ప్రధాన రహదారి విస్తరణకు ఇరువైపులా ఉన్న దుకాణాలు, గృహాలకు ఆర్అండ్‌బి డిఇ నాగమోహన్ తన సిబ్బందితో కలిసి శుక్రవారం మార్కింగు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటపల్లి నుంచి కురుపాం అటవీశాఖ కార్యాలయం వరకు మంజూరైన రహదారి విస్తరణ పనులకు కురుపాం గ్రామ చివరి వరకు జరిగాయని, ఇప్పుడు కురుపాంలో రహదారికి మధ్య నుంచి ఒక్కొక్క వైపు ఏడు మీటర్ల చొప్పున విస్తరణ జరుగుతుందని, కొన్ని దగ్గర్లో పెరగవచ్చునని తెలిపారు. వారికి ఐదు రోజులు సమయం ఇచ్చామని జెసిబి కూడా ఇస్తామని చెప్పారు. ఐదు రోజుల్లో వారు తొలగించకపోతే తాము దగ్గరుండి తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఇ నిర్మల కుమారి, ఆర్ అండ్ బి సిబ్బంది పాల్గొన్నారు.

అప్పయ్యపేటలో 104 వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని అప్పయ్యపేటలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి కె శిరీష ఆధ్వర్యంలో 104 వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రోగులకు తనిఖీలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బిపి, సుగర్, జ్వరంతో బాధపడుతున్న వారిని పరీక్షించారు. గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె వివరించారు. కార్యక్రమంలో ఎంపిటిసిసభ్యులు బురిడి కుసుమ సూర్యనారాయణ, గ్రామ పెద్దలు, రోగులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలోని అంబిలి గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ డొంక త్రినాధులు శుక్రవారం సందర్శించారు. సిబ్బంది హాజరుతో పాటు పిఎంజెఎవై, ఎస్‌డిజి సర్వే రికార్డులను పరిశీలించారు. ఈ సిబ్బంది సమయపాలన పాటించి, విధులకు హాజరు కావాలని, వాలంటీర్లను సమన్వయం చేసుకొని ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చూడాలని సూచించారు. అలాగే గ్రామంలోని ఎంపియుపి పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

శ్రీ కైలాసనాథ ఆలయ 40వ వార్షికోత్సవం సందర్భంగా శివపార్వతుల కల్యాణం కన్నులపండుగ్గా నిర్వహించారు. కల్యాణం అనంతరం శివపార్వతుల విగ్రహాలను గుమ్మలక్ష్మీపురం పురవీధుల్లో శుక్రవారం సాయంత్రం ఘనంగా ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు, ఉప సర్పంచ్ కొత్తకోట కిషోర్, ఆలయ కమిటీ అధ్యక్షులు కొత్తకోట విష్ణుప్రసాద్ పాల్గొన్నారు.

కైలాసనాథ్ యాత్రకు 60మంది పోలీసు సిబ్బంది

ప్రజాశక్తి- గుమ్మలక్ష్మీపురం

కైలాసనాథ దేవాలయం 40వ వార్షికోత్సవం సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న యాత్రలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎల్విన్‌పేట పోలీసులు ముందస్తు జాగ్రత్త చేపట్టారు. ఎల్విన్‌పేట సర్కిల్ పరిధిలో పనిచేస్తున్న 60 మంది పోలీస్ సిబ్బందిని యాత్ర సందర్భంగా నియమించారు. యాత్రలో ప్రజా రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సిఐ సత్యనారాయణ సిబ్బందికి సూచనలిచ్చారు.

ఆరోగ్యానికి చిరుధాన్యాలే శ్రేష్ఠం



డెంకాడ.. ర్యాలీ చేపడుతున్న అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులు

ప్రజాశక్తి-రేగిడి

చిరుధాన్యాలతో ఎంతో మేలని, ఆ ఆహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని ఎంపిడిఒ జి.కాశీవిశ్వనాథరావు, ఎపిఎం మంగమ్మ అన్నారు.. శుక్రవారం రేగిడిలో అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మహిళా రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.

రామభద్రపురం : చిరుధాన్యాలు ఆహారంలో తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందడానికి అవకాశం ఉందని ఎపిఎం గాడి వెంకట రమణ తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్య మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైకెపి కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిరుధాన్యాల పంటల ఆవశ్యకత, వాటిని పండించే విధి విధానాలు, మార్కెటింగ్ సదుపాయాలు, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలు వివరించారు. అనంతరం సిబ్బంది, రైతు సంఘాల ప్రతినిధులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒ ఎపిఎం రత్నకుమార్ పాల్గొన్నారు.

గజపతినగరం : అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవంలో భాగంగా వైకెపి ఆధ్వర్యాన రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు సమావేశం ఏర్పాటుచేశారు. సమావేశంలో చిరుధాన్యాల ఉపయోగాలను సిఎన్‌ఎఫ్, వైకెపి సిబ్బంది వివరించారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎఫ్‌పిఒ ఎపిఎం ఎస్.సత్యవతి, ఎస్.ఇ.వి.పి ఇందిరా దేవి, జనరల్ యు.జగదీష్ కుమార్, సిఎన్‌ఎఫ్ సిబ్బంది సత్యవతి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస : కొత్తవలస మండల సమాఖ్య భవనం వద్ద అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవాన్ని ఎపిఎం వెంకటరమణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరిగింది. మండలంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎపిఎం జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



వేపాడ.. ర్యాలీ చేపడుతున్న అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులు



కొత్తవలస.. ర్యాలీ చేపడుతున్న అధికారులు, మహిళా సమాఖ్య సభ్యులు

జామి : అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవం సందర్భంగా మండలంలోని రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులతో ఎపిఎం పైడేశ్వరి ఆధ్వర్యాన సమావేశం ఏర్పాటుచేశారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎం మధుమహేష్, ఎపిఎం విజయ పాల్గొన్నారు.

డెంకాడ : మండల సమాఖ్య కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మిల్లెట్స్ అవసరం, లాభాలపై ఎఫ్‌పిఒ విశ్వేశ్వరరావు వివరించారు. అందరికీ చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి చెప్పాలన్నారు. అనంతరం మహిళలతో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్య సిబ్బంది శ్రీనివాసు, గురుభక్తులు, సిసిలు సూరి, నర్సింగరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

వేపాడ : చిరుధాన్యాల వల్ల ప్రయోజనాలపై వైకెపి ఆధ్వర్యాన మహిళా సమాఖ్య సభ్యులు వేపాడలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎపిఎం ఆర్.శ్రీనివాసరావు, సిసి కృష్ణ, విఒఎలు పాల్గొన్నారు.

'లెండి'లో లక్ష్య-2023


మాట్లాడుతున్న టెస్సాల్వ్ సెమీకండక్టర్ సంస్థ సీనియర్ మేనేజర్ తమ్మిరాజు

ప్రజాశక్తి-డెంకాడ

లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రికల్ విభాగ విద్యార్థి సంఘం(లక్ష్య) వార్షికోత్సవాన్ని లక్ష్య-2023 పేరిట శుక్రవారం ప్రారంభించారు. వార్షికోత్సవ సభలో టెస్సాల్వ్ సెమీకండక్టర్ సంస్థ సీనియర్ మేనేజర్ జి.తమ్మిరాజు మాట్లాడుతూ స్పష్టత, నిబద్ధతతో టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను కొనసాగించి సాంకేతికతలో విప్లవాత్మక మార్పులతో వస్తున్న కొత్త ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ లాంటి బ్రాంచ్‌లలో విద్యనభ్యసించే వారికి ప్రత్యామ్నాయ శక్తి వనరులు, ఎలక్ట్రికల్ వెహికల్స్, చిప్ డిజైనింగ్‌లో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. అందుకు ధీటుగా విద్యార్థినీ విద్యార్థులను తయారు చేస్తున్న లెండి కళాశాల ఇఇఇ విభాగాన్ని అభినందించారు. ప్రిన్సిపల్ డాక్టర్ వి.వి.రామారెడ్డి మాట్లాడుతూ అన్ని విషయాల్లో ఎలక్ట్రికల్ విభాగం ముందుకెళుతుందన్నారు. విద్యార్థులు ఉత్సాహంగా ఇటువంటి మరిన్ని విద్యార్థి ఉత్సవాల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రికల్ వెహికల్‌పై వర్క్‌షాప్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, పోస్టర్ ప్రజెంటేషన్, రోబో రేస్, రోబో వార్స్ వంటి పోటీలను నిర్వహించారు. అందులో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం సంస్థ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ కె.శివరామకృష్ణ, ప్రిన్సిపల్ వి.వి.రామారెడ్డి, ఇఇఇ హెచ్ఒడి కె.సుబ్బరామయ్య అతిథులను సత్కరించారు.

వైస్ ప్రిన్సిపల్ హరిబాబు తమ్మినేని, ఎ వి పరాంకుశం, ప్లేస్‌మెంట్ డీన్ జి.ప్రకాశ్‌బాబు, విభాగాల అధిపతులు, రాజన్‌బాబు, రామారావు, రాజేంద్ర, సుబ్బరామయ్య, సతీష్ పూజారి, దుర్గా శైలజ, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు వేగవంతం

ప్రజాశక్తి-వేపాడ


సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఇఒపిఆర్‌డి

పన్నుల వసూలు వేగవంతం చేయాలని ఇఒపిఆర్‌డి సిహెచ్. సూర్యనారాయణ.. సచివాలయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలోని వేపాడ, వల్లంపూడి సచివాలయాల సిబ్బందితో సమావేశం ఏర్పాటుచేశారు. జెఎస్ఎస్, పన్నుల వసూలు, అభివృద్ధి పనులపై సచివాలయ సిబ్బంది చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. సమావేశంలో వేపాడ, వల్లంపూడి పంచాయతీ కార్యదర్శులు, భాగ్యలక్ష్మి, ధనలక్ష్మి పాల్గొన్నారు.

నెల్లిమర్ల : నగర పంచాయతీలో శత శాతం పన్ను వసూళ్లు చేపట్టాలని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సూచించారు. పన్ను వసూళ్లలో 6, 7 సచివాలయాల పరిధిలో శత శాతం వసూలు చేపట్టి, రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలవడం అభినందనీయమని తెలిపారు. ఈ నెలాఖరుకు పూర్తిపన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో మేనేజర్ టి.వి.ఎస్.విశ్వేశ్వరరావు, ఆర్ఐ కోరాడ త్రినాథరావు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ యాప్‌తోనే కూలీలకు వేతనాలు

ప్రజాశక్తి-రేగిడి

ఉపాధి హామీలో పనులు చేస్తున్న కూలీలకు ఎన్ఎంఎంఎస్ యాప్ నమోదుతోనే కూలి బ్యాంకు ఖాతాలో జమవుతుందని ఎపిఒ ఎస్.హరినాథ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని తునివాడలో ఉపాధి పనులను పరిశీలించారు.. ముందుగా మస్టర్లను తనిఖీ చేశారు. రెండు పూటలా కొలతల ప్రకారం పనిచేస్తే రూ.257 కూలి వస్తుందని తెలిపారు. ఎన్ఎంఎంఎస్ యాప్ ద్వారా హాజరు, ఫొటో పంపిస్తేనే రోజువారి కూలి వస్తుందన్నారు. అలా కాకుంటే వేతనాలు రావని, అందుకు మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లే బాధ్యత వహించాలని చెప్పారు. పనుల వద్ద టెంట్లు, తాగునీరు ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ రాజు పాల్గొన్నారు.

బిసి జాబితాలో చేర్పించాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

రాష్ట్రంలోని కాపు, తెలగ, బలిజ, ఒంటరి తరగతులను బిసి జాబితాలో చేర్పించాలని తెలగ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు సిహెచ్ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. ఆ తరగతులను బిసిలో చేర్పించాలని 1995లో హైకోర్టు ఫుల్‌బెంచ్ తీర్పు ఇచ్చినా అమలు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనతో సుస్థిర అభివృద్ధి

ప్రజాశక్తి-నెల్లిమర్ల


కార్యక్రమంలో మాట్లాడుతున్న బి.రామకృష్ణ

రాష్ట్రంలో సామాజిక అభివృద్ధికి బాల్య వివాహాలు అవరోధంగా ఉన్నాయని సామాజిక, పరివర్తన మార్పు సమాచార వ్యవస్థ జిల్లా సమన్వయ అధికారి బి.రామకృష్ణ అన్నారు. సుస్థిర, సామాజిక అభివృద్ధి సాధించాలంటే బాల్య వివాహాలు సున్నాకు చేరుకోవాలన్నారు. శుక్రవారం నెల్లిమర్లలోని డైట్ కళాశాలలో విద్యార్థులకు బాల్య వివాహాల నిర్మూలన, లింగ వివక్ష, రక్తహీనత, పౌష్టికాహారం, జంక్ ఫుడ్ వల్ల కలిగే ప్రమాదాలు, ఉన్నత లక్ష్యాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 112 నంబరుకు సమాచారం అందించాలన్నారు. ప్రతిరోజూ మంచి పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత రాకుండా కాపాడుకోవచ్చున్నారు. కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపల్ తిరుపతినాయుడు, వైస్ ప్రిన్సిపల్ కె.రామకృష్ణారావు, కె.చంద్రశేఖర్, ఎ.శ్రీనివాస్, ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

రీసర్వేతో రైతులకు ఉపయోగం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

భూముల రీసర్వేతో రైతులకు ఉపయోగమని తహశీల్దారు కెవి రమణరాజు తెలిపారు. శుక్రవారం మండలంలోని సారిపల్లిలో భూసర్వే కార్యక్రమాన్ని తహశీల్దారు కె.వి.రమణరాజు ప్రారంభించారు. గ్రామసభ నిర్వహించి రీ సర్వేపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దారు మాట్లాడుతూ సాగులో ఉండి హక్కు పత్రాలు లేని వారికి సర్వే ద్వారా గుర్తించి వారి పేర్లు ఆన్‌లైన్లో నమోదు చేస్తున్నట్లు పేర్కన్నారు. ప్రతిఒక్కరూ సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయి విభీషణరావు, గ్రామ పెద్దలు సారిపల్లి గుర్నాథ్ రావు, నడిపేన ఆనందరావు, విఆర్ఒ కె.సురేష్ పాల్గొన్నారు.


పాఠశాలలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న ఎంపిడిఒ స్వరూపరాణి

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని గొలగాం, పినతాడివాడ సచివాలయాలను ఎంపిడిఒ డిడి స్వరూపరాణి శుక్రవారం సందర్శించారు ఈ సందర్భంగా గ్రామంలో పింఛను కోసం నమోదు చేసుకున్న దరఖాస్తుదారులను ఆమె పరిశీలించారు. అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరవుతాయని తెలిపారు. పేడాడ పంచాయతీ తమ్మాపురంలో పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా? లేదా? భోజనాలు రుచికరంగా ఉన్నాయా? అని ఆరాతీశారు.

మెసానిక్ పాలి క్లినిక్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి - విజయనగరంకోట

నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని మహారాజా విజయరామ గజపతిరాజు మెసానిక్ పాలి క్లినిక్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మహారాజ విజయరామ గజపతి మెసానిక్ సెక్రెటరీ జి.ప్రభాకర్, ట్రెజరర్ పి.వి.శంకర్, డాక్టర్ బి.శ్రీస్నేహ, ఫంక్షన్ హాల్ ఇంఛార్జి బొడ్డుల నర్సింగరావు కోరారు. శుక్రవారం స్థానిక మెసానిక్ టెంపుల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో సభ్యులు మాట్లాడారు. మహారాజ విజయరామ గజపతి 1909లో నగర ప్రజల కోసం ఈ మెసానిక్ భవనాన్ని నిర్మించారన్నారు. చెన్నై వారి సహకారంతో 2016లో ఈ టెంపుల్ ద్వారా ప్రజలకు వైద్య సదుపాయాల అందించాలని నిర్ణయించారన్నారు. ఫిజియోథెరపీ, డెంటల్ క్లినిక్ అతి తక్కువ ఫీజుతో సేవలందిస్తున్నారని తెలిపారు. కరోనా వల్ల నిలుపుదల చేసిన ఈ క్లినిక్‌ను మళ్లీ పునరుద్ధరించామన్నారు. సాయంత్రం 4గంటల నుంచి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. అలాగే మెసానికి టెంపుల్ లో ఉన్న ఎసి ఫంక్షన్ హాల్ ను తక్కువ అద్దెకే ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డెంటల్ గీతం కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ డిఎస్‌రాజు పాల్గొన్నారు.

నవధాన్యాలతో భూసారం

ప్రజాశక్తి-కొత్తవలస

నవధాన్యాలతో భూసారం పెరుగుతుందని మాస్టర్ ట్రైనర్ కోటి బాబు తెలిపారు. ఉత్తరాపల్లి గ్రామంలో విత్తన గులికలు కార్యక్రమంపై పిఒ సంఘం ప్రెసిడెంట్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం రైతులకు శిక్షణ ఇచ్చారు. వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటలు వేసుకోవాలని ప్రకృతి వ్యవసాయం ఫీల్డ్ కోఆర్డినేటర్ బి.గోవిందరావు తెలిపారు. కార్యక్రమంలో క్లస్టర్ సిఆర్‌పి దేవుడమ్మ, ఐసిఆర్‌పి గౌరీ పాల్గొన్నారు.

మూడో లైన్ పనులు వేగవంతం

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్


మూడో రైల్వే పనులను పరిశీలిస్తున్న మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్

స్థానిక పట్టణ రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న మూడవ లైన్ రైల్వే పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేలా కృషి చేయాలని రైల్వే సిబ్బందిని కలెక్టర్ నిశాంత్‌కుమార్ కోరారు. శుక్రవారం ఆయన రైల్వే సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఐవి గురునాథరావుతో కలిసి పనులను పరిశీలించారు. పనుల వివరాలను సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వివరించారు. విజయనగరం - టిట్లఘర్ మధ్య నిర్మిస్తున్న రైల్వే మూడో లైను పనులను 265 కిలో మీటర్లు మేర రూ.2335.68 కోట్లతో చేపట్టడం జరుగుతోందన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో 44 కిలో మీటర్లు చేపడుతున్నామని, ఇందులో మేజర్ బ్రిడ్జిలు మూడు, ఆరు ఆర్.యు.బిలు, 135 మైనర్ బ్రిడ్జిలు నిర్మాణం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని కూనేరు నుంచి సీతానగరం వరకు పనులు జరుగుతున్నాయన్నారు. పార్వతీపురంలో అదనపు కాలినడక వంతెన, బుకింగ్ కార్యాలయం, కూనేరు, గుమడ, పార్వతీపుం, సీతానగరంలో మెరుగైన సౌకర్యాలతో కొత్త స్టేషన్ భవనాలు రానున్నాయని చెప్పారు.

40 మందికి కంటి పరీక్షలు

ప్రజాశక్తి - లక్కవరపుకోట



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ఈశ్వరరావు

మండలంలోని గొల్జాం పంచాయతీలో వెల్‌నెస్ సెంటర్ వద్ద శుక్రవారం నిర్వహించిన వైఎస్ఆర్ కంటి వెలుగు శిబిరంలో 40 మంది వృద్ధులకు నేత్ర పరీక్షలుచేశారు. వీరిలో పదిమందికి కంటి శస్త్రచికిత్సలు చేయాల్సి ఉందని వైద్యాధికారి సిహెచ్ ఈశ్వరరావు వెల్లడించారు. మిగిలిన వారికి వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా కళ్లద్దాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఎఎన్ఎంలు డి హైమావతి , జి చంద్రమ్మ , ఆశా కార్యకర్తలు కె.పద్మా వెంకటి , డి.సంతోషమ్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు గొల్జాంలో ఉచిత గుండె వైద్య శిబిరం

మండలంలోని గొల్జాంలో శనివారం ఉచితంగా గుండె వైద్య పరీక్షలు చేయనున్నట్లు వైసిపి సీనియర్ నాయకులు తూర్పాటి వెంకటరామకృష్ణ, సర్పంచ్ సంతోషమ్మ తెలిపారు. విశాఖలోని అను న్యూరో కార్డియాక్ ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె వైద్య నిపుణులు జి.పాల్ కిరణ్ నేతృత్వంలో తనిఖీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గుండెనొప్పి, దడ, బిపి, గ్యాస్ ట్రబుల్, కళ్లు తిరగడం, ఎడమచేయి లాగడం, పొట్ట, కిడ్నీ సమస్యలు, నిద్ర సరిగ్గా పట్టకపోవడం, మెదడు సమస్యలపై వంటివి తనిఖీ చేస్తారని వివరించారు. ఇసిజి, గుండె స్కానింగ్ ఉచితంగా తీస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

తలనీలాల టికెట్ ధర పెంపు అన్యాయం

ప్రజాశక్తి - విజయనగరం కోట

దేవాలయాల్లో తలనీలాలు టికెట్ ధరపెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు బవిరెడ్డి శివప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం దేవాలయాలలో తలనీలాల టికెట్ ధర రూ.25 నుంచి రూ.40కు పెంచడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని 610 దేవాలయాలలో నిత్యం అనేకమంది కుటుంబాలతో దర్శనం ముందు తలనీలాలు ఇచ్చే సంప్రదాయం ఆది కాలం నుండి వస్తున్న ఆచారమని తెలిపారు. దీన్ని ఆసరా చేసుకొని వైసిపి ప్రభుత్వం ధరలు పెంచడం అన్యాయమని అన్నారు.

పెద్దూరులో అంధకారం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని దశమంతపురం పంచాయతీ పెద్దూరులో విద్యుత్ సరఫరా లేక గ్రామస్తులు అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నారు. గురువారం సాయంత్రం పడ్డ చిన్నపాటి చినుకులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు తెలిపారు. కొండలకు గ్రామం సమీపంలో ఉన్నందున జంతువులతో పాటు విష సర్పాలు కూడా గ్రామాలకు వచ్చే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

మద్యంతో ఒకరు అరెస్టు

ప్రజాశక్తి-బొబ్బిలి

అక్రమ మద్యంతో పట్టణానికి చెందిన పి.శంకరరావును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఇబి సిఐ ఆర్.జైభీమ్ తెలిపారు. పట్టణంలోని ఎరుకులవీధికి చెందిన శంకరరావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో శుక్రవారం దాడి చేసినట్లు తెలిపారు. 42 మద్యం సీసాలను సీజ్ చేసి, శంకరరావును అరెస్టు చేశామన్నారు. ఎవరైనా అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయిస్తే 9440902372 కు సమాచారం ఇవ్వాలని కోరారు. దాడిలో ఎస్ఇబి సిబ్బంది మాధవి, చంద్ర ప్రసాద్, జయరామ్, సరస్వతి పాల్గొన్నారు.